

# అయోమయం

ఆ రోజు క్రిస్మసు పండుగదినం. అందరూ సాయంకాలం ప్రార్థనకై చర్చివద్ద చేరారు. మతగురువు ప్రార్థన మొదలుపెట్టాడు. పిల్లలంతా బయట ఆడుకుంటున్నారు.

ఆవూళ్లో రెండేళ్ల గిత్తదూడ ఒకటిఉంది. అది శుద్ధ పోట్లగొడ్డు. దాన్ని ముట్టుకుంటే చాలు-తరుముకొచ్చి క్రిందపడేసి పొడిచి పొడిచి వదిలిపెడుతుంది. అది చర్చి బయట ఎక్కడో మేస్తున్నది. ఎవడో ఒక కొంటెవెధవ దాని దగ్గరకు వెళ్లి ఏంచేశాడో ఏమో తరుముకువచ్చింది. ఆ కుర్రాడు హడలిపోయి పరుగు పుచ్చుకున్నాడు.

చర్చి దగ్గరికి వెళ్లేటప్పటికి అది కుర్రాడిని సమీపించింది. వాడు చటుక్కున చర్చిలోకి దూరాడు. దూడకూడా వాడిని వదిలిపెట్టక వెంటబడి చర్చిలోకి వెనకాలే తరుముకువచ్చింది. చర్చిలో సూది దూపడానికి కూడా స్థలం లేకుండా తొక్కిడిగా ఉంది. ఆ దూడ జనంలో పడి వాళ్లందర్నీ చెల్లాచెదరు చేసి, ఆ కుర్రాడిని కొమ్ములతో యెత్తి పారేసింది.

ఆ విసురుకి వాడు వెళ్లి తల క్రిందులుగా ఒక ముసలమ్మమీాద పడ్డాడు. ఆమె వెళ్లి గోడకు కరుచుకున్నది. తలకు గట్టిగా తగలడంచేత పెద్దగా అరుస్తూ "అయ్యో! వీడి అమ్మ కడుపుమాడ! చంపేశాడ్రోయ్" అని తిట్టడం లంకించుకొంది.

ఆ దూడ అంతటితో ఊరుకోక అడ్డంవచ్చినవారినెల్లా కుమ్మడం మొదలెట్టింది. ఆ గందరగోళం

**యన్. బాలభారతసింగ్**

చూసి తీరాలి. ప్రార్థనామందిరంలో ముందుభాగాన ఉన్నవారికి యీ గందరగోళం ఏమిటో అర్థం కాలేదు. కాని ద్వారందగ్గరనుండి కేకలు, పెడబొబ్బలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. అందుచేత వాళ్లంతా ప్రార్థన మానేసి ఆగోల ఏమిటని ఒకళ్ల నొకళ్లు అడుగుతూ, కంగారుపడటం మొదలెట్టారు.

వేళాకోళానికి ఒకడు పక్కవాడితో "ఏకుక్కఅయినా లోపలికి జొరబడి ఉంటుంది" అన్నాడు. ఆపక్కనేవున్న ఒకఆమె హడలిపోయి, చర్చిఅంతా ప్రతిధ్వనించేటట్లు "అమ్మాయ్! ఎక్కడ ఉన్నావే? ఇల్లారా కరచి, చంపేస్తుంది." అని అరిచింది. లోపల ఉన్నవాళ్లంతా ఒకళ్ళ నొకళ్లు తోసుకుంటూ క్రిందా మీాదాపడటంలో దీపం క్రింద పడిఆరిపోయింది.

దీపాలు ఆరిపోవడంచేత చర్చి అంతా చీకటిమయం అయింది. ఇంతలో ఎవడో 'చర్చి అంటుకుంది' అని అరిచాడు. దీపాలుకూడా ఆరిపోవడంలో మరీ గందరగోళం అయిపోయింది.

"పిచ్చికుక్క!"

"కాలిపోతూంది"

"నడవండి! నడవండి!"

"ఏమిటి యీగోలఅంతా? కొంప మునిగింది."

"యేదో ప్రమాదం జరిగింది."

అనుకుంటూ అందరూగుమ్మాల వైపుకు తోసుకురావడం ప్రారంభించారు. ఆ సమ్మర్దంలో మనిషి కదలడానికి కూడా వీలు లేకపోయింది. చర్చి కావలాదారు 'దొంగలు దొంగలు' అని అరుస్తూ పరవళ్లు తొక్కాడు.

ఆడవాళ్లందరూగొర్రెలమందల్లా మతగురువు వైపుకు తోసుకురావడం ప్రారంభించారు. అర్చకుడు

చేతిలోనున్న పళ్లెంతో వాళ్లనెత్తి మీద కొట్టి వెనక్కు తరుముతూ "ఇలా ఎక్కడికి? లోపలికి వచ్చి అపవిత్రంచేస్తారా? — ఛీ! అవతలకు పొండి. ఆడవాళ్లు ఇక్కడికి రాకూడదని తెలీదూ? " అని కేక లేశాడు.

ఆ రోజు గ్రామాధికారి గూడ చర్చిలో ఉన్నాడు. అతడు లావుగా పిప్పళ్ళ బస్తాకు కాళ్లు పెట్టినట్లుంటాడు. గున గునా నడుస్తూ ఎలాగో కష్టపడి ద్వారందాకా వచ్చాడు. కాని అక్కడనించి ఇక వెళ్ళలేక 'ఏయ్! — నన్ను వెళ్ళనియ్యండి.! నేనూ — గ్రామాధికారిని. తప్పుకోరేం?" అని చలాయించాడు.

గ్రామాధికారి అయితే కావచ్చు కాని ఆ సమయంలో అతనిమాట వినేవాళ్లు ఎవరు. ఎవరి మటుకు వాళ్లు అయోమయంలో పడిఉన్నారు. అసలు ఈ గందరగోళానికి కారణం ఎవరికీ తెలియదు. కాని తలోకమాటచెప్పి బ్రహ్మాండంచేశారు. చివరకు ప్రార్థన జరగలేదు సరికదా! తలుపులూ, కిటికీ ఊచలూ విరిచి చావు తప్పి కన్ను లొట్టబోయినంత పనితో అందరూ బయట పడ్డారు.

అందరూ బయటికి వచ్చి చూద్దురుగదా చర్చికి ఏ అపాయం లేదు-వీళ్ళు పగులగొట్టిన తలుపులు కిటికీఊచలు మినహా. అంత గందరగోళానికి కారకుడైన ఆ అబ్బాయి అక్కడనే ఉన్నాడు. కాని అతనికి కూడా కారణం తెలియదు. అందరూ అలాగే అయోమయంగా ఉండిపోయినారు. ★

(రష్యన్ కథ ఆధారంగా)

# ★ విజ్ఞాన వీథులు ★

(11-వ పేజీ తరువాయి)

ప్రయోగ సాక్ష్యము నిజము. ఆ ప్రయోగంలో అది నిజము, ఈ ప్రయోగములో ఇది నిజము. ఇక కణమూ, తరంగమూ అన్నవి మనము ఊహించిన తత్వాలు. ఎలక్ట్రానును చేరేవరకూ ఈ తత్వాల స్వభావ విజ్ఞానానికి దెబ్బతగలలేదు. ఎలక్ట్రానును చేరేసరికి తగిలింది దానికి జవాబు ఎలక్ట్రానుయొక్క కణతరంగత్వము లేదా తరంగ కణత్వమును గుర్తించుట. అంతేగాని ఈ కుక్కతోక పట్టుకుని బృహత్ప్రపంచ ప్రయోగసత్యాల్ని ప్రశ్న వెయ్యడం కాదు. మీదు మిక్కిలి ఈ అనిర్దేశిత్వాన్ని పట్టుకుని జ్యోతిషంలో కనపడే అనిర్దేశిత్వాన్ని సమర్థించబోవడము మహాసాహసం వెనకటికి ఇద్దరు స్నేహితులు పెరళ్ళలో నూతులు తీయించారట ఒకనికి ఆ మట్టిలో తీగలు దొరికినవి - ఆతడు పొరుగువానితో "చూడవోయి మిత్రమా మన పూర్వులు టెలిగ్రాఫూ, టెలిఫోనూ ఎరగరని ఈ సాక్ష్యాన్ని చూస్తూ ఎలాగనగలను?" అన్నాడట. రెండవవానికి (*Wires*) ఏవీ దొరకలేదు. "ఏమోయి నేస్తమూ, ఈ సాక్ష్యం చూస్తూ పూర్వులకు *Wireless* తెలియదని ఎలాగనడమూ?" అన్నాడట. అలాగ మన వెంకటరావుగారికి జ్యోతిషంయొక్క అనిర్దేశిత్వాన్ని సమర్థించడానికి ఎలక్ట్రాను తత్వంలోని అనిర్దేశిత్వం దొరికింది. జ్యోతిషంయొక్క నిజము నిశ్చయము కాదంటే, "నిజముయొక్క తత్వమే నిశ్చయంకాదు" అనేవరకూ వెళ్లేరు. ఇది నిజంగా అతీంద్రియ శక్తే—వెంకటరావుగారు మరొకరీతిగా జవాబు చెప్పవచ్చును. "ప్రయోగంవల్ల నేకాక అతీంద్రియ శక్తివల్ల కనుక్కున్నది - విజ్ఞాన సూత్రాలకు వ్యతిరేకంగా కనపడినా - నిజమే కావచ్చునని." అవును. అతీంద్రియ శక్తివల్ల కనుక్కున్నది మన మెరిగిన నిజాలకు పైనవుండే నిజమే అయితే ఈ శాస్త్రం అతీంద్రియ శక్తివల్ల కనుక్కున్నదనడానికి సాక్ష్యము, ఆధారము, అధికారము, ఏమీ వుండనక్కరలేదా? అని అడుగుతాను. త్యాగరాజస్వామి 'గ్రహబలమేమి, రామానుగ్రహబలమే బలము' అన్నాడు. పురందరదాసు విఠలస్వామితో "నీవే నా చంద్రసూర్యులు, నీవే నాగురుడు" అన్నాడు. వారతీంద్రియసంపన్నులు కారంటారా? రామకృష్ణస్వామి అదృశ్యయోగము వంటి సిద్ధులే లోకప్రయోజనాలకు ఉపయోగిస్తే ఎగిరిపోతా యన్నాడు. అలాగ ఎగిరిపోయిన ఉదాహరణము చెప్పినాడు. అతీంద్రియ శక్తిని మానవుల ఐహిక ఫలసూచన కుపయోగించిన మహానుభావు డెవడు? సత్యాచార్యుల దొక పద్ధతా? జైమినిది మరొకటా? బృహస్పతిది శకునమా? మరొకరిది పుట్టుమచ్చల శాస్త్రమా? ఇంకొకరిది గౌళి పలుకా? ఇవన్నీ అతీంద్రియశక్తివల్ల సాధించినవా? ఏమిటండీ ఈ దబాయింపు అంటే "ఓ పెద్ద హీమరుకే తెలియడం లేదు చూసుకోగమని వెక్కిరింతలా? ఇదంతా చక్కగా తెలిసిన విషయంగురించిన ప్రస్తావ నేనా? ★

# గ్రంథ సమీక్ష

## కథాసాగరం 9, 10, 11 :

'శివం,' పంతుల శ్రీరామశాస్త్రి, వాసిరెడ్డి సీతాదేవిగార్ల కథల సంపుటాలు ఒక్కొక్క సంపుటి రూపాయి - దేశి ప్రచురణలు, విజయవాడ 2

ఒక్కొక్క కథకుని కథానికలను ప్రత్యేక సంపుటాలుగా దేశిప్రచురణకర్తలు ప్రచురిస్తున్న కథాసాగరంలో ఇవి మూడు ఈ విధమైన ప్రచురణవల్ల ఆయా కథకుల ప్రత్యేకతను మరింత సులువుగా విస్పష్టపరిచే అవకాశం కలుగుతున్నది

"జీవితంలోని సామాన్య సంఘటనలనూ, సంఘర్షణలనూ" చిత్రించడం, రకరకాల వ్యక్తుల భావోద్వేగాల "స్వభావాలను సత్యాన్ని పరిశీలించి వ్యక్తీకరించడం" 'శివం' గారి లక్ష్యం వీరి కథానికల్లో చాల వరకు దారిద్ర్యంతో నలిగే మధ్యతరగతి వ్యక్తులకు, సంసారాలకూ సంబంధించినవి. జీవితసంగ్రామంలో నిలవలేక భయపడుతూ చేతులతో కళ్లు కప్పుకొని కలవరించే వ్యక్తులే చాలమంది ఈ కథానికల్లో ప్రత్యక్షమౌతారు. కోపధారి అయిన, ఉపాధ్యాయుడు అక్రమంగా శిక్షించడం సహాధ్యాయులు నలుగురిలో నగుబాటుపాలవడం రంగారావు అసమర్థతకు కారణమన్నట్లు "అసమర్థుడు" అనే కథానికలో సూచించారు మిగిలినవానిలో దారిద్ర్యం, మధ్యతరగతి మానవుల వింత మనస్తత్వాలు ఈ భయంకరమైన జీవితానికి హేతువులన్నట్లు రచనలు చేశారు మొత్తానికి వీరు చిత్రించిన వ్యక్తులు భయపీడితులు. జీవితం భయంకరం ఎక్కడా ఆశగాని చిరునవ్వు గాని కనపడదు. విషయానికి అనుగుణంగా రచనా సంవిధానం సాగుతుంది

పంతుల శ్రీరామశాస్త్రి గారి కథలలో

(56-వ పేజీ చూడండి)